# అభివృద్ధికి ఆకర్షితులయ్యే చేరికలు



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్



వైశ్యుల ఆత్మీయ సమ్మేళనంలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

- బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సంజయ్
- పార్టీలో పలువురి చేరిక
- కండువా కప్పి ఆహ్వానం

జగిత్యాల కలెక్టరేట్, నవంబర్ 25: బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులయ్యే వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఆ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ ఎం సంజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని గోవింద్‌పల్లెకు చెందిన గాండ్ల సంఘం కార్యవర్గానికి చెందిన 10 మంది సభ్యులు మోతె రోడ్డులోని పార్టీ కార్యాలయంలో శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి డాక్టర్ సంజయ్‌కుమార్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

### బీఆర్ఎస్‌కు అండగా ఉండి గెలిపించాలి

వైశ్యులు, శివసత్తులు బీఆర్ఎస్‌కు అండగా ఉండి కారు గుర్తుకు ఓటు వేసి జగిత్యాల ఎమ్మెల్యేగా రెండోసారి తనను గెలిపించాలని జగిత్యాల ఎమ్మెల్యే అభ్యర్థి, డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని నారాయణదాసు ఆశ్రమంలో వైశ్య, బీఎల్ఎన్ గార్డెన్‌లో శివసత్తులతో శనివారం ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంజయ్‌కుమార్ మాట్లాడుతూ, కారు గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అలాగే 29వ వార్డు కౌన్సిలర్ పంబాల రామ్‌కుమార్ తండ్రి నారాయణ అనారోగ్యంతో మృతిచెందగా, సంజయ్‌కుమార్ కౌన్సిలర్ రాము, అతడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఇక్కడ పలువురు నాయకులున్నారు.


# సంజయ్‌ను మరోసారి ఆశీర్వదించండి

- బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సతీమణి ప్రచారం
- కారు గుర్తుకు ఓటెయాలని విన్నపం
- గ్రామాల్లో పార్టీ శ్రేణుల ప్రచారం



రంగపేట, ఒడ్డెరకాలనీ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సతీమణి రాధిక, నాయకులు

సారంగాపూర్, నవంబర్ 25: నియోజకవర్గ అభివృద్ధి కోసం కష్టపడి పనిచేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను మరోసారి ఆశ్వీరించాలని సంజయ్ కుమార్ సతీమణి రాధిక అన్నారు. రంగపేట, ఒడ్డెరకాలనీ గ్రామాల్లో శనివారం స్థానిక నాయకులతో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేసి అన్ని వర్గాలకు మేలు చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు అండగా నిలవాలన్నారు. ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే సతీమణి రాధికకు ప్రజాప్రతినిధులు, మహిళలు బతుకమ్మతో స్వాగతం పలికారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు బెక్కెం జమున, పల్లపు వెంకటేశ్, దోనకంటి తిరుపతి, మాజీ ఎంపీటీసీ చిట్నేని రవీందర్‌రావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



లక్ష్మీదేవిపల్లిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

సారంగాపూర్, బీర్‌పూర్ మండల కేంద్రాలతోపాటు ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ కోల జమున, జడ్పీటీసీ మేడిపెల్లి మనోహర్ రెడ్డి, జిల్లా కేడీసీసీబీ డైరెక్టర్ ముప్పాల రాంచందర్ రావు, రైతు బంధు సమితి సభ్యులు కొల్ముల రమణ, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు గుర్రాల రాజేందర్ రెడ్డి, నారపాక రమేశ్, రైతు బంధు సమితి మండల కన్వీనర్లు కోల శ్రీనివాస్, మేరుగు రాజేశం, విండో చైర్మన్లు ఏలేటి నర్సింహా రెడ్డి, మల్లారెడ్డి, ఆలయ చైర్మన్ నేరెల్ల సుమన్ గౌడ్, ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి

- వివిధ పార్టీల నాయకులు, ప్రజలు సహకరించాలి
- జిల్లా అడిషనల్ ఎస్పీ భీమ్‌రావు కొడిమ్యాలలో ఫ్లాగ్ మార్చ్

కొడిమ్యాల, నవంబర్ 25: నవంబర్ 30న నిర్వహించనున్న అసెంబ్లీ ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేందుకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా అడిషనల్ ఎస్పీ భీమ్‌రావు అన్నారు. 180వ అసిస్టెంట్ కమాండర్ పవిత్ర భూషన్, బీఎస్ఎఫ్, క్యూఆర్‌టీ, ఏఆర్‌టీ బృందాలతో శనివారం మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ నుంచి సూరంపేట రోడ్డులో గల శ్రీ లక్ష్మి వేంకటేశ్వర ఆలయం వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలో అన్ని పార్టీల నాయకులు, ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఎన్నికల జరిగేందుకు సహకరించాలన్నారు. మెట్‌పల్లి, కోరుట్ల, మల్యాలలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మల్యాల సీఐ కోటేశ్వర్, కొడిమ్యాల, మల్యాల ఎస్ఐలు వెంకట్రావ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



ఫ్లాగ్ మార్చ్‌లో పోలీస్ సిబ్బంది

### ఎన్నికల ఖర్చుల కోసం రూ.10 వేల అందజేత



ఎన్నికల ఖర్చుకు నగదు అందిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

రాయికల్, నవంబర్ 25: ధర్మాజీపేట గ్రామానికి చెందిన కొత్త కొండ శ్రీనివాస్ గౌడ్ శనివారం ఎన్నికల ప్రచారానికి వచ్చిన జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సంజయ్ కుమార్‌కు ఎన్నికల ఖర్చుల కోసం రూ.10వేలను అందజేశారు. ఈ సందర్భంగా తనకు ఎన్నికల ఖర్చుల కోసం పదివేలు అందించిన శ్రీనివాస్ గౌడ్‌కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలియజేశారు.

### కేసీఆర్ సభకు భారీగా తరలి రావాలి

రాయికల్, నవంబర్ 25: పట్టణంలోని గీత విద్యాలయం గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించనున్న బీఆర్ఎస్ ఆశీర్వాద సభకు రాయికల్ పట్టణం, మండలం నుంచి భారీగా ప్రజలు, కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని జగిత్యాల ఎమ్మెల్యే బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కోరారు. ఈ మేరకు ఒక ప్రకటనలోలో పేర్కొన్నారు.

### బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

రాయికల్, నవంబర్ 25: రాయికల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బర్కం మల్లేశ్, తండ్రి సింగరావుపేట గ్రామ మాజీ సర్పంచ్ బర్కం రాజయ్య శనివారం అనారోగ్యంతో మరణించారు. కాగా వారి కుటుంబ సభ్యులను జగిత్యాల ఎమ్మెల్యే బీఆర్ఎస్ అభ్యర్థి సంజయ్ కుమార్ పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.


### పేదలకు దుప్పట్ల పంపిణీ

జగిత్యాల, నవంబర్ 25: జిల్లా కేంద్రంలోని మిషన్ కాంపౌండ్ ఏరియాలో నివాసముంటున్న పేదలకు శ్రీ పార్వతి పరమేశ్వర సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ, పేదలకు సేవ చేయడమే తమ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### రామకృష్ణ కళాశాలలో ఎన్‌సీసీ దినోత్సవం

జగిత్యాల, నవంబర్ 25: స్థానిక రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలలో 75వ ఎన్‌సీసీ దినోత్సవంలో భాగంగా ఎన్‌సీసీ విద్యార్థులు వయోవృద్ధులు, స్త్రీలను గౌరవిస్తామని, ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తామని, నిష్పక్షపాతంగా ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ యాద రామకృష్ణ, ప్రిన్సిపాల్ కే రాజేందర్, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ ఏ మారుతీ శ్రీహరిరావు, ఎన్‌సీసీ కేడెట్స్ పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి రూ.లక్ష ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న బాపురెడ్డి

కథలాపూర్, నవంబర్ 25: భూషణరావుపేట గ్రామానికి చెందిన బత్తిని శ్రీకాంత్‌గౌడ్ అనే యువకుడు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబానికి మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి శనివారం రూ. లక్ష ఆర్థికసాయం అందించారు. శ్రీకాంత్‌కు ఇద్దరు చిన్నపిల్లలు ఉండడంతో వారి పేరుతో బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్‌ను చిన్నారులకు అందించారు. శ్రీకాంత్ మృతి చెందడంతో బాధిత కుటుంబం ఇంటి పెద్దదిక్కు కోల్పోయి ఇబ్బందుల్లో ఉండడాన్ని గమనించిన బాపురెడ్డి మానవత్వం చాటుకొని రూ.లక్ష ఆర్థికసాయం అందించినట్లు ఆయన తెలిపారు. దాతలు ముందుకు వచ్చి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొండ ఆంజనేయులు, నాయకులు శ్రీనివాస్, శేఖర్‌రెడ్డి, గంగారెడ్డి, గౌడ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

### ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయండి

కథలాపూర్, నవంబర్ 25: వేములవాడ నియోజకవర్గ కేంద్రంలో ఆదివారం నిర్వహించే బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలం నుంచి సుమారు 10 వేల మంది హాజరుకావాలని, సీఎం కేసీఆర్ పాల్గొనే భారీ బహిరంగా సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలన్నారు.